# విరామము లేని దినము

## చదవుటకు నియమించినవి #11

V. రెండవ పస్కానుండి మూడవ దాని వరకు (కొనసాగింది).
  K. రెండవ గలిలయ యాత్ర (లూకా 8:1-3).
  L. దూషణతో కూడిన నింద (మత్తయి 12:22-37; మార్కు 3:20-30; లుకా 11:14-23).
  M. సూచక క్రియలను వెదకువారు (మత్తయి 12:38-45; లూకా 11:16, 24-26, 29-36).
  N. క్రీస్తు కుటుంబం (మత్తయి 12:46-50; మార్కు 3:31-35; లూకా 8:19-21: 11:27, 28).

### పరిచయం

భోజనం చేయడానికి కూడా విరామములేని దినం నీకెప్పుడైనా తటస్థించిందా? క్రీస్తు ప్రభువులవారి జీవితంలో అలాటి ఒక దినాన్ని గూర్చినది ఈ పాఠం. క్రీస్తు ప్రభువు పరిచర్య దినాల్లో కేవలం కొన్ని మాత్రమే వివరంగా దాఖలు చేయబడ్డాయి. వాటిలో ఒకటి, "ప్రశ్నల దినం" అనబడే ఒకదినం, ఆయన మరణానికి ముందు మంగళవారం. మరొకటి ఈ పాఠంలో చర్చించబడింది. తగిన విధంగా యిది "విరామము లేని దినము"[1] అని పిలుపబడింది.

రెండవ గలిలయ ప్రయాణం చివరిలో (లేక అంతానికి సమీపంలో) ఈ దినము తటస్థించింది. మన గత పాఠంలో, కపెర్నహూమునుండి నాయీనుకు క్రీస్తు పయనించాడు (లూకా 7:1, 11), తరువాత పేర్లు తెలుపని చోట్లకు వెళ్లాడు (లూకా 7:20, 21, 36, 37). "వెంటనే ఆయన దేవుని రాజ్య సువార్తను తెలుపుచు, ప్రకటించుచు, ప్రతి పట్టణములోను ప్రతి గామములోను, సంచారము చేయుచుండగా" అంటూ లూకా దాఖలు చేశాడు (లూకా 8:1).[2]

గలిలయ తొలి ప్రయాణంలో, కేవలం నలుగురు శిష్యులు మాత్రమే ప్రభువుతో ప్రయాణం చేశారు.[3] ఈ ప్రయాణంలోనైతే, పన్నిద్దరు ఆయన దగ్గర పని నేర్చుకునే వారున్నారు. జనసమూం ఆయనను వెంబడిస్తూనే ఉంది.[4]

ప్రభువువలన సహాయం పొందిన కొందరు స్త్రీలు ఆయనతోను అపొస్తులులతోను ప్రయాణం సాగించినట్టు లూకా తెలిపాడు. "వీరును ఇతరులనేకులును, తమకు కలిగిన ఆస్తితో వారికి ఉపచారము చేయుచు వచ్చిరి" (లూకా 8:3బి).[5] తమ ఉపదేశకులను గౌరవించు యూదా స్త్రీలకు అది అసాధారణం కాదు. వీరిలో కొందరి పేర్లు తెలుపబడ్డాయి: "ఏడు దయ్యములు వదలిపోయిన[6] మగ్దలేనే అనబడిన మరియయు, హేరోదు

గృహనిర్వాహ కుడగు కూజా భార్యయగు యోహన్నయు, సూసన్నయు ఆయనతో కూడ ఉండిరి” (లూకా 8:2బి).

ఈ మరియ “మగ్దలేనే” అని పిలువబడింది. ఎందుకంటె, గలిలయ సముద్రానికి పశ్చిమ తీరాన ఉన్న మగ్దల అనే ఒక చిన్న గ్రామానికి ఆమె చెందింది.[7] ఈమెను మరల మనం కలిసికొంటాం (మార్కు 15:47; 16:1, 9; యోహాను 19:25; 20:1–18).

యోహన్న తన భర్తయైన కూజావలన గుర్తింపును పొందింది. అతడు “హేరోదు గృహనిర్వాహకుడు.” “గృహనిర్వాహకుడు” అనే పదం గ్రీకులో సామాన్యంగాకాక “పరిపాలకుడు, పైవిచారణ చేయు అధికారి” అను అర్థంతో ఉపయోగిస్తారు.[8] కూజా హేరోదు రాజనగరుకు యింటికి సంబంధించిన కార్యాలను, వ్యాపారానికిని కార్యనిర్వాహకుడైయున్నాడు” అని Living Bible దండాన్వయం చేసింది. క్రీస్తు యొక్క సందేశం హేరోదుయొక్క యింటిలోనికిని చొచ్చింది! మనం యోహన్నను తరువాత కలిసికొంటాం (లూకా 24:10).

సూసన్నను గూర్చి వేరే స్థలంలో కన్పించదు. “సూసన్నకు వేరొక రికార్డులేదు. ఆమెను అమరు రాలిగా చేయడానికి యిదే సరిపోతుంది” అని మెగార్వే వ్రాశాడు.[9]

తిరిగి ప్రభువు ప్రయాణం నొద్దకు వెళ్లుదాం. “ఆయన ఇంటిలోనికి వచ్చినప్పుడు జనులు గుంపులు కూడి వచ్చిరి గనుక భోజనము చేయుటకైనను వారికి వీలులేక పోయెను” (మార్కు 3:20ఎ). ఈ ప్రయాణంలో ఆయన ఆతిథ్యం పొందేవాని యింట ప్రవేశించారని అర్థం కావచ్చు.[10] దీని తరువాత ఆయన సముద్రతీరాన బోధించినట్టుంది (మార్కు 4:1). గనుక, ఈ ప్రయాణం చివరిలో ఆయన కపెర్నహూమునకు తిరిగి వచ్చినట్టున్నారు – అది ఆయన ఆ పట్టణంలో నివసించే మామూలు స్థలమైయుంటుంది.

అది ఏ పట్టణమైయున్నా, విరామంలేని ఆ దినాన జరిగిన సంఘటనలను కొన్నింటిని మనం సర్వే చేద్దాం. అదే దినాన, మత్తయి 13, మార్కు 4, లూకా 8లో దాఖలు చేయబడ్డ ఉపమానాలను ప్రభువు తెలిపియుండవచ్చు (మత్తయి 12:50–13:3 చూడు). ఆ దినము గలిలయ సముద్రాన్ని నిమ్మళింపజేయడంతోను, గెరసీనుల దయ్యాన్ని వెళ్లగొట్టడంతోను ముగిసియుండవచ్చు (మార్కు 4:33–5:19). ఈ సంభవాలను గూర్చి తరువాత పాఠాల్లో చదువుదాం. ప్రస్తుతానికి, దినం ఎలా ఆరంభమయ్యిందో చూద్దాం.

## ప్రజలకు సహాయపడుటలో విరామం లేకుండుట

## (మత్తయి 12:22, 23; మార్కు 3:20, 21; లూకా 11:14)

పెందలకడనే ఆయన ఏకాంత స్థలానికి వెళ్లి ప్రార్థించడం ప్రభువుకు వాడుక (మార్కు 1:35). మన కథ ప్రారంభలో, ఆయన నివసించే స్థలంలో ఉదయ భోజనానికి ప్రభువు తిరిగి వచ్చినట్టున్నారు. ఆయన ఆ యింటికి తిరిగి వచ్చేటప్పటికే ఆయన మాటలు వినడానికిని, ఆయనచే స్వస్థత పొందడానికిని జనులు ఆ యింటినిండా ఉన్నారు (మార్కు 2:1, 2). మార్కు 3:20 యిలా అంటుంది: “ఆయన యింటిలోనికి వచ్చినప్పుడు జనులు గుంపు కూడి వచ్చిరి గనుక భోజనము చేయుటకైనను వారికి వీలులేక

పోయెను."[11] ఆటంకమును లేక్క చేయక, క్రీస్తు వారికి సహాయము చేయ మొదలుపెట్టెను.

ఒక అద్భుతాన్ని రిపోర్టు చేసారు. ఇందులో బుద్ధి, దృష్టి, మాట అనే మూడు తిరిగివచ్చాయి. క్రీస్తు ఒక గుడ్డి మూగవానికి పట్టిన దయ్యాన్ని వెళ్లగొట్టాడు[12] (మత్తయి 12:22). "అందుకు ప్రజలందరు విస్మయమొంది – ఈయన దావీదు కుమారుడు కాడా, అని చెప్పుకొనుచుండిరి"[13] (మత్తయి 12:23).

ఎలాగో మొత్తానికి, నిర్విరామమైన క్రీస్తు ప్రభువు యొక్క కార్యకలాపాలను గూర్చిన సమాచారం ఆయన కుటుంబికులకు స్నేహితులకు తెలిసింది.[14] "ఆయన ఇంటివారు సంగతి విని, ఆయన మతి చలించియున్నదని చెప్పి ఆయనను పట్టుకొనబోయిరి"[15] (మార్కు 3:21). భౌతికమైన గమ్యాన్ని చేరడానికి అవసరమైన త్యాగాన్ని చేసినప్పుడు అనేకులు సహృదయంతో సహకరిస్తారు; మత సంబంధం కాని పనులకు చాలా సమయం గంటలు అవసరమని వారు అర్థం చేసికొంటారు. కాని, దేవుని రాజ్యం కొరకు ఒకడు తనను తాను ఎందుకు వెచ్చించుకుంటాడో అనేకులు గ్రహించలేరు. ప్రభువుకు "మతి చలించిందని" ఆయన కుటుంబ సభ్యులనుకున్నారు. దేవుడు మొదట అనే దృఢమైన తీర్మానం నీవు చేసుకుంటే (మత్తయి 6:33), నీకు మతిపోయిందని ఎవరైనా నిన్ను నిందించినట్టయితే ఆశ్చర్యపోకు.[16]

## నిందలకు నిర్విరామంగా బదులిచ్చుట

## (మత్తయి 12:24-37; మార్కు 3:22-30; లూకా 11:15-23[17])

ప్రభువు బోధిస్తూ స్వస్థపరచుతూ ఉండగా, మామూలుగానే శాస్త్రులు పరిసయ్యులు హాజరయ్యారు (మత్తయి 12:24; మార్కు 3:22). కొందరైతే ఆయనను బాధించడానికి "యెరూషలేమునుండి" వచ్చారు (మార్కు 3:22ఎ) ఆయన దావీదు కుమారుడై ఉంటాడని జనులు అనడంతో (మత్తయి 12:23), వారి ద్వేషం అత్యధికమౌతుంది. క్రొత్త పంథాలో ఆయనపై బడడానికి ప్రయత్నం సాగించారు. క్రీస్తు అద్భుతాలు చేస్తున్నారన్న వాస్తవాన్ని కాదనలేక, ఆయన సాతానుతో జతకూడి ఉన్నట్టు నేరం మోపసాగారు.[18] ఆయన "బెయెల్జెబూలు[19] పట్టినవాడై దయ్యముల యధిపతిచేత దయ్యములను వెళ్లగొట్టుచున్నాడని చెప్పిరి"[20] (మార్కు 3:22బి).

వారు మోపిన నిందకు ప్రభువు మూడు వివాదములతో బదులిచ్చారు.[21] వారి నేరారోపణ న్యాయవిరుద్ధమైనదని ఆయన మొదటిగా తెలియజేశారు: "–తనకు తానే విరోధముగా వేరుపడిన ప్రతి రాజ్యము పాడై పోవును. తనకు తానే విరోధముగా వేరుపడిన యే పట్టణమైనను ఏ యిల్లయినను నిలువదు. సాతాను సాతానును వెళ్లగొట్టిన యెడల తనకు తానే విరోధముగా వేరుపడును; అట్లయితే వాని రాజ్యమేలాగు నిలుచును?" (మత్తయి 12:25, 26).

రెండవది, వారి నేరారోపణ పొసగనిది: వారి కుమారులు (అంటే, శిష్యులు) దయ్యాలను వెళ్లగొట్టుతున్నట్టు వారు నమ్ముతారు (మత్తయి 12:27). అంటే, తమ్మును వెంటాడే వారు మాత్రం సాతాను శక్తివలన దయ్యాలను వెళ్లగొట్టారట![22] క్రీస్తు ప్రభువు

మీద మోపే ఏ నేరమైనా తమ సొంత దేశీయులకు వ్యతిరేకంగా వారు మోపవలసి ఉంది.[23]

మూడవది, వారి నేరారోపణ అసాధ్యమైనదని ఆయన అన్నారు. ఒక బలవంతుని యింట ప్రవేశించడానికి, మొదట బలవంతుని (సాతానును) బంధించడం అవసరం (మత్తయి 12:29).[24] దయ్యములను వెళ్లగొట్టడంవలన, ఆయన సాతానును ఓడించు తున్నాడేగాని వానిని ప్రోత్సహించడంలేదు.

ప్రభువు తనను తాను కాపాడుకొనడం మానుకొని, ఎదిరించ నారంభించారు. "కాబట్టి నేను మీతో చెప్పునదేమనగా – మనుష్యులు చేయు ప్రతి పాపమును దూషణయు క్షమింపబడునుగాని ఆత్మ విషయమైన దూషణకు పాపక్షమాపణ లేదు" (మత్తయి 12:31). "దూషణ" అంటే వ్యతిరేకంగా మాట్లాడడం. శాస్త్రులు పరిసయ్యులును పరిశుద్ధాత్మకు విరోధంగా మాట్లాడే దోషం చేశారు. ఎలాగంటే, పరిశుద్ధాత్మ పనిని వారు సాతానుకు ఆరోపించారు. (మత్తయి 12:28). పరిశుద్ధాత్మకు విరోధంగా మాట్లాడే ఎవనికైనా పాపక్షమాపణలేదని ప్రభువువారు తెలియజేశారు (మత్తయి 12:32).

మాట జారినందుకు ప్రభువు తన శత్రువులను ఖండించలేదు. కాని మారని వారి కఠినమైన హృదయాలను బట్టి ఆయన వారిపై తప్పుమోపారు. "హృదయమందు నిండియుండు దానిని బట్టి నోరు మాటాలాడు"నని ఆయన అందుకే తెలియజేశారు (మత్తయి 12:34బి). "కీడు మేలని మేలు కీడని" పిలిచే మానసిక రుచిని వారు పెంచుకున్నారు (యెషయా 5:20). శాస్త్రులు పరిసయ్యులు అట్టి దుస్థితికి ఎలా వచ్చిచేరుకున్నారు? యేసు వారి మెస్సీయాయై యున్నాడని ఆత్మ కలిగించే సాక్ష్యాన్ని వారు ఆలోచించడానికి స్థిరంగాను, మానసికంగాను నిరాకరించడంవలన వారి హృదయాలు రాతిలా కరుడుగట్టుకుపోయాయ్ (యోహాను 12:40).

"పరిశుద్ధాత్మకు విరోధంగా పాపము" చేశామా అని కొన్ని సార్లు ప్రజలు ఆశ్చర్యపోతారు.[25] "నీవు అలా చేశావేమోనని ఆందోళన పడుతుంటే, నీవు చేయ లేదు" అని ఒక పెద్ద సువార్తికుడన్నాడు. అట్టి అక్కర అనేది ఒకని హృదయం కఠినం కాలేదనడానికి రుజువని అర్థం. వాస్తవంగా, సశరీరుడుగా ప్రభువు భూమిమీద ఉండి, నేడు పరిశుద్ధాత్మ శక్తివలన ఆయన అద్భుతాలు చేయడం లేదు. గనుక పరిసయ్యులు చేసిన అదే పాపం విషయములో నీవు నేను దోషులమై ఉండకపోవచ్చు. అయితే ఆలాటి పాపం చేసే అవకాశముంది. "మారుమనస్సు పొందునట్లు నూతన పరచుట అసాధ్యమయ్యే"లా మన హృదయాలను మనం కఠినం చేసికోవచ్చు (హెబ్రీ. 6:6; 4–6లను చూడు). మన హృదయాలు మెత్తనివిగా నిలుపుకొనడానికి దేవుడు మనకు సహాయము చేయును గాక (2 రాజులు 22:19)!

## విరామం లేకుండ అపార్థాలతో పోరాడడం

## (మత్తయి 12:38-45; లూకా 11:16, 24-26, 29-36)

క్రీస్తు తర్కాన్ని తప్పుపట్టలేకపోగా, ఆయన గద్దింపులచే గుచ్చబడినవారై, ఆయన

శత్రువులు మరొక తంత్రాన్ని ప్రయోగించారు. “అప్పుడు శాస్త్రులలోను పరిసయ్యులలోను కొందరు – బోధకుడా,[26] నీవలన ఒక సూచక క్రియ చూడగోరుచున్నామని ఆయనతో” చెప్పారు (మత్తయి 12:38). దీనిలో వారి సాహసాన్ని గూర్చి యోచించు. క్రీస్తు ప్రభువు వెళ్లిన చోట్లకెల్లను ఆయనను వెంటాడుతున్నారు, ఆయన చేసిన సూచక క్రియలను చూస్తునే ఉన్నారు. ఆ దినముననే మూడుగా పెనవేయబడిన ఒక సూచక క్రియను వారు చూచారు. వారికి యింకా ఏమికావాలి? “పరలోకమునుండి ఒక సూచక క్రియను చూపుమని” వారాయనను అడిగినట్టు లూకా వ్రాస్తున్నాడు (లూకా 11:16). ఏలీయా ఆకాశంనుండి అగ్నిని తెప్పించినట్టు, ఒక వేళ ప్రభువును వారు అలా సవ్వాలు చేస్తున్నారేమో (1 రాజులు 18:36–38; 2 రాజులు 1:10).

“కోరినప్పుడు ప్రభువు అద్భుతాలను” చేయలేదు (మత్తయి 4:3, 4; లూకా 23:8, 9). హీనమైన ప్రదర్శనకొరకు ప్రభువు ఎన్నడూ అద్భుతాలను చేయలేదు. పైగా, కఠిన హృదయులగు ఈ విమర్శకులను పరలోకం నుండి, భూమిమీద నుండి భూమిక్రింద నుండి ఏ అద్భుతము ఒప్పించలేదని ఆయనకు తెలుసు. గనుక ఆయన వారికి యిలా ప్రత్యుత్తరమిచ్చారు:

> వ్యభిచారులైన చెడ్డ తరమువారు సూచక క్రియను అడుగుచున్నారు.[27] ప్రవక్తయైన[28] యోనాను గూర్చిన సూచక క్రియయేగాని మరి ఏ సూచక క్రియయైనను వారికి అనుగ్రహింపబడదు.[29] యోనా మూడు రాత్రింబగళ్లు[30] తిమింగిలము[31] కడుపులో ఏలాగుండెనో ఆలాగు మనష్యకుమారుడు మూడు రాత్రింబగళ్లు భూ గర్భములో ఉండును. (మత్తయి 12:39, 40).

క్రీస్తుయేసు పునరుత్థానమునకు తెరవేసిన రిఫరెన్సయి ఉంది: తన మరణము సమాధి తరువాత ఆయన మూడవ దినాన లేపబడుతాడు (మత్తయి 16:21; 17:23; 20:19). క్రీస్తు ప్రభువు శత్రువులు ఆయన మాటలను గ్రహించలేదు సరిగదా; ఆయన శిష్యులు కూడా వాటిని గ్రహించలేదు. (తన అపొస్తులులకు ఆయన పొందబోయే మరణాన్ని గూర్చి తెలుపక ముందు ఈ సంగతి జరిగింది). క్రీస్తు దేవుని కుమారుడనే రుజువుకు ఆయన పునరుత్థానము చివరి “గురుతై” ఉంది (రోమా 1:4).

అప్పుడు శాస్త్రులును పరిసయ్యులను ఆయన గద్దింపసాగారు (వారిచే నడిపింపబడిన వారిని సహా). భక్తిహీనులైన నీనెవే వారు సహితం వారియంత కఠిన హృదయులు కాదని (దక్షిణ దేశపు రాణియైన, షెబాదేశపు రాణి) నిజదేవుని పూజింపని ఆమె సయితం వారికంటె ఎక్కువ తేటగా యోచింప మనస్సు గలదైయుంది (మత్తయి 12:41, 42; లూకా 11:31, 32). తన్ను విమర్శించేవారు తమ హృదయాలను తెరిచి ఉంచగలిగితే వారి జీవితాలు వెలుగు మయమైయుంటాయని ఆయన రెండు భాషా అలంకారాలను ఉపయోగించారు (లూకా 11:33–36).

ఒక మనుష్యుని విడిచిపోయిన అపవిత్రాత్మ దానికంటె మరి చెడ్డవైన ఏడు దయ్యాలను తోడ్కొని వచ్చిన మరొక ఉదాహరణను ప్రభువు తెలిపారు (మత్తయి

12:43-45; లూకా 11:24-26). ఈ చిన్న ఉపమానానికి సాధారణమైన వర్తింపు ఉంటుంది. అయితే, ఆ సందర్భంలో అది యూదా మతనాయకులకు వర్తిస్తుంది. బబులోను చెరానంతరం, విగ్రహసంబంధమైన "దయ్యాలను" వారు వెళ్లగొట్టారు - అయితే ఆ "దయ్యముల" స్థానంలో దేవునియందలి స్థిరమైన నమ్మిక, ఆయన చిత్తానికి లోబడడం వంటివాటిని వారు నిలుపలేదు. తత్ ఫలితంగా, మొదటి దానికంటె మరి చెడ్డవైన "ఏడు దయ్యాలు" వారిలో వాసం చేస్తున్నాయి: జ్ఞానహీనత, పరపక్షద్వేషము, స్వనీతి, వేషధారణ, అవిశ్వాసము, తిరుగుబాటు, తప్పుస్థలంలో ఉంచబడిన విలువలు అనేవి.[32]

## నూతన సంబంధాలు స్థాపించడంలో విరామం లేకుండుట.

## (మత్తయి 3:31-35; లూకా 8:19-21; 11:27, 28[33])

క్రీస్తు ప్రభువు ఎంత శక్తివంతంగా మాట్లాడాడంటే, ఆ జనసమూహంలోని స్త్రీ అభినందన పట్టలేక: "-నిన్ను మోసిన గర్భమును నీవు కుడిచిన స్తనములును ధన్యము లైనవని కేకలు వేసి" చెప్పింది (లూకా 11:27బి). మరియు చెప్పిన ప్రవచనానికి యిది దాఖలు చేయబడిన నెరవేర్పు ఉంది (లూకా 1:48). "అవునుగాని దేవుని వాక్యము విని దానిని గైకొను వారు మరి ధన్యులని చెప్పెను" (లూకా 1:28బి).[34]

ప్రభువు తన తల్లిని తగ్గించి మాటలాడలేదు. ఆయన ఆమెను ప్రేమించాడు.[35] అయితే దేవునికి లోబడే కుమారుడైయుండడం క్రీస్తు తల్లియైయుండడం కంటె ఎక్కువ ముఖ్యమైనదని ఆయన నొక్కి చెప్పారు. ఇది మనందరికి ఎంత ఉత్సాహాన్ని కలిగించేదై ఉండాలి! అందరిలో కేవలం ఒక్కతి మాత్రమే ప్రభువుకు భౌతికమైన తల్లియైయుండ వీలుంటుంది. అయితే మనమందరం ఆయనకు శిష్యులయ్యే అవకాశముంది.

ఈ ముఖ్యమైన సత్యము కొద్ది సమయం తరువాత నొక్కి చెప్తాను. క్రీస్తు జనసమూహములకు బోధించుతుండగా (మత్తయి 12:46), "ఆయన సహోదరులును[36] తల్లియు వచ్చిరి" (మార్కు 3:31ఎ). జనసమూహమును బట్టి ఆయన వద్దకు రాలేక[37] ఆయనను చూడగోరి వర్తమానం పంపారు (3:31బి, 32). ప్రభువును వారెందుకు చూడగోరారో మనకు తెలియదు. మార్కు 3:21; 3:31 కలిపి చూస్తే, ఆయనను యింటికి తోడ్కొని పోవాలని వచ్చినట్టు తోస్తుంది.[38] కారణమేమైయున్నా, "ఇదిగో నీ తల్లియు నీ సహోదరులును వెలుపల ఉండి, నీ కోసరము వెదకుచున్నారని" వాక్యం ఉంది (మార్కు 3:32). ప్రభువు ప్రసంగానికి అంతరాయం కలిగించినట్టయింది.

ఘన బోధకుడైన క్రీస్తు ప్రభువు ఆ అంతరాయాన్ని సయితం ఉపదేశపు అవకాశంగా వినియోగించుకొంటూ యిలా అన్నారు: "నా తల్లి ఎవరు, నా సహోదరు లెవరు?" అని ఆయన అడిగారు (మత్తయి 12:48). తన యెదుట కూర్చుండిన శిష్యులవైపు ఆయన చూపించి, "ఇదిగో నా తల్లియు నా సహోదరులును; పరలోకమందున్న నా తండ్రి చిత్తము చొప్పున చేయువాడే నా సహోదరుడును, నా సహోదరియు, నా తల్లియు ననెను" (మత్తయి 12:49బి, 50). ప్రభువు ప్రకటనను లూకా యిలా వ్యక్తపరచాడు:

“దేవుని వాక్యము విని, దాని ప్రకారము జరిగించు వీరే నా తల్లియు నా సహోదరులనని వారితో చెప్పెను” (లూకా 8:21).

కుటుంబసంబంధమైన బాంధవ్యాలను క్రీస్తు ప్రభువు చులకనగా చేయలేదు. కుటుంబ బాధ్యతలు ఆయనకు ఎంతో ముఖ్యము (మత్తయి 15:4–6; యోహాను 19:26, 27; 1 తిమోతి 5:8 చూడు). అయినా, భౌతికమైన కుటుంబం కంటెను హెచ్చయిన, గొప్పదైన బాంధవ్యాన్ని ఆయన మరోసారి నొక్కి చెప్పుతున్నారు: అది తనతోను తన తండ్రితోను మనకుండవలసిన ఆత్మ సంబంధమైన బాంధవ్యం. “దేవుని వాక్యము విని దాని ప్రకారము” మనము జరిగించినట్టయితే (లూకా 8:21; మత్తయి 7:21–27 చూడు), ఆయన తన తల్లితోను భౌతికమైన సహోదరులతోను అనుభవించిన బాంధవ్యాన్ని మించిన దాన్ని మనం అనుభవించవచ్చు![39]

క్రీస్తు శిష్యులకు (మనకును) ప్రోత్సాహమునిచ్చు మాటలివి. అయితే, ప్రభువు తీవ్రంగా ఎదిరింపబడిన ఆ రోజును దృష్టిలో ఉంచుకొని చూడు. ఆయన వెళ్లిపోయిన తరువాత సంఘానికి బీజంగా పనిచేసే సమర్పణగల శిష్యుల గుంపు ఆయనకు అవసరమయింది. ఈ నూతనమైన చిరకాలముండే బాంధవ్యాలు ఎంతో తప్పని సరియైనవై ఉన్నాయి.

## ముగింపు

ఆ దినం అవడానికి యింకా చాల దూరంగానే ఉంది. ముఖ్యమైన అద్భుతాలతో పాటు ఎక్కువ ఉపదేశం కూడా జరిగింది.[40] నేనే యేసునైయుంటే, నేను అప్పటికే అలసిపోయి ఉండేవాడనే. (సంఘర్షణ, ఎదిరింపు, వివాదం అనే వాటికంటే నా శక్తిని తగ్గించేవి మరేవీ ఉండవు). ఏదియెలా ఉన్నా, ఆ ఒక్కదినం ముగియాలంటే – తరువాత వచ్చే పాఠాల కొరకు మనం వేచి ఉండవలసి ఉంటుంది. విరామములేని చురుకైన ఈ ఇరవై నాలుగు గంటల దినం మీద తెర వేసే సమయం యిదే.

మన లేఖన భాగమంతటిలో (ప్రాక్టికల్) ఆచరణ యోగ్యమైన పాఠాలు యిమిడి ఉన్నాయి.[41] అయినా, మనం చదివిన దానిలో ప్రధానమైనది మత్తయి 12:30లో కన్పిస్తుంది. అక్కడ “నా పక్షమున ఉండనివాడు నాకు విరోధి; నాతో కలిసి సమకూర్చనివాడు చెదరగొట్టు వాడు.” అని వ్రాయబడింది. మనం క్రీస్తు పక్షముననైనా ఉండాలి, లేకుండైనా ఉండాలి. తటస్థ మార్గమేదీ లేదు. నేను ఎవరి పక్షంగా ఉన్నాను? నీవు ఎవరి పక్షంగా ఉన్నావు?

---

సూచనలు

[1]A. T. Robertson, *A Harmony of the Gospels for Students of the Life of Christ* (New York: Harper Row, 1950), 61 [2]లూకా మాత్రమే ఈ ప్రయాణాన్ని దాఖలు చేశాడు. మత్తయి, మార్కులు సూచనలు ఉన్నాయి. [3]“అధికారము గలవానివలె” అనే పాఠాన్ని చూడు. [4]“ప్రేమ, కన్నీరు మరియు క్షమాపణ” పాఠాన్ని చూడు.

[5]యేసును ఆయన శిష్యులును పరామర్శింపబడక పోతే – ఆ స్త్రీలు వారికి సిద్ధపరచిన భోజన పదార్థాలను తెచ్చియిచ్చేవారేమో. ఆయన పేదల మధ్య ఎప్పుడు ఉన్నట్టు చిత్రింపబడినందున యిది మితమైన ఖర్చుతో కూడినదైయుండవచ్చు (లూకా 9:48; 2 కొరింథీ. 8:9; మత్తయి 17:24–26 చూడు). [6]మగ్దలేనే మరియ పాపాత్మురాలైన స్త్రీ అయ్యే అవకాశంలేదని "ప్రేమ, కన్నీరు, క్షమాపణ" అనే దానిలో చదివాం. ఈమె ఏడు దయ్యములనుండి విడిపింపబడిన స్త్రీ. [7]దేశపటం చూడు. [8]J. W. McGarvey and Philip Y. Pendleton, *The fourfold Gospel or A Harmony of the four Gospels* (Cincinnati: Standard Publishing Co., 1914), 297. [9]Ibid. [10]NASBలో "యిల్లు" అక్షరార్థంగా "యింటిలోనికి".

[11]ఈ లేఖన భాగాన్ని మార్కు 6:31తో పోల్చిచూడు. [12]ఇది ముందుగా పెనవేయబడిన అద్భుతం. [13]"దావీదు కుమారుడు" (అంటే, మెస్సీయాను) సూచిస్తుంది. [14]"తన సొంత ప్రజలు" అంటే "తనతోకూడ ఉన్నవారని" అక్షరార్థం. ప్రభువుతో వారికి కొంత సంబంధముంది. "ఆయన స్నేహితులు" అని అన్నది, "ఆయన కుటుంబము" అని NIVలో ఉంది. [15]మత్తయి 14:3; అపొ. 24:6లో కొన్ని సార్లు ఒకరిని బంధించుటకు ఉపయోగించింది. [16]అర్థం చేసుకొను దానిని ఉపయోగించింది. [17]లూకా రచనలోని వంటిదానిని మత్తయి, మార్కు రచనల్లో చదువు. [18]"యజమానుని కలిసికో"లో "యేసు, క్షమింపరాని పాపం" అనే పాఠాన్ని చూడు. [19]"బయెల్జెబూలు" అనేది విగ్రహారాధికుల దేవత (2 రాజులు 1:2) ఆ మాటకు అక్షరార్థం "ఈగల ప్రభువు." ఇక్కడ ఆ పేరు సాతానును సూచించడానికి ఉపయోగింపబడింది (మార్కు 3:22, 23). [20]ఆది భాషలో ఉన్నట్టే తెలుగులో ఉంది – "దయ్యములు".

[21]ఈ వివాదాలను మార్కు "ఉపమానాలు" అని అంటున్నాడు (మార్కు 3:23). దాని కొరకైన చర్చను చూడు. [22]ఇది గుప్తం చేయబడింది. [23]ప్రభువు దయ్యాలను మాటలతో వెళ్లగొడతారు. యూదులు దయ్యాలను వెళ్లగొట్టడానికి మూఢనమ్మకాలకు సంబంధించిన కర్మకాండను వినియోగిస్తారట. ఈ రెండింటికి మధ్య ఎంతో వ్యత్యాసముంటుంది. [24]అపవాదిని బంధించుటను గూర్చి, "ప్రకటన, 9," "సాతానును బంధించుట" అనే పాఠాన్ని ట్రూత్ ఫర్ టుడే (అక్టోబరు 1999; ఆంగ్లంలో ), 45–51 చూడు. [25]"యజమానుని కలిసికో"లో "యేసు, క్షమింపరాని పాపం" అనే పాఠాన్ని చూడు. [26]ప్రభువుకు గౌరవ పదమైన ఈ బిరుదును వారివ్వడంలో వేషధారణ ఉంది. లూకా 7:40తో దీన్ని పోల్చి చూడు. [27]1 కొరింథీ. 1:22 చూడు. [28]ప్రభువు యింకను అద్భుతాలు చేస్తూనే ఉన్నారు గనుక యిది అధికమైన సూచక క్రియగా పేర్కొన వచ్చు. [29]మత్తయి 16:4 చూడు. [30]"మూడు రాత్రింబగళ్ళు" అనే దానికి చార్టును చూడు.

[31]KJVలో "తిమింగలము" అని ఉంది. గ్రీకులో "Sea monster" అని ఉంది. NKJVలో "గొప్ప మత్స్యము" అని ఉంది. పాత నిబంధనలో కూడా యిదే ఉంది (యోనా 1:17). యోనాది కట్టుకథ అని కొందరంటారు, అది నిజంగా జరిగిందని యేసు అంటారు. [32]నన్ను అపార్థం చేసికొనకండి. దయ్యాలు నిజం కాదని నేను అనడం లేదు. యూదా మత నాయకుల్లో ఉన్న కొన్ని సమాంతర భావాలను మాత్రమే నేను ఉదహరించాను. దయ్యాలు మనుష్యులను పట్టినట్టే, పాపాలు యూదా మత నాయకులును పట్టాయి అనేదే సమాంతరం! [33]యేసు కుటుంబ కథ లూకా 8లో చేర్చబడింది. మత్తయి మార్కులు కథ చెప్పిన చోట ఆయన తల్లిని గూర్చి ఒక స్త్రీ పలికిన పలుకులను లూకా వ్రాశాడు (లూకా 11:27, 28). ఇవన్నీ ప్రాథమికంగా ఒక పాఠాన్ని తెలియజేస్తున్నందున నేను వాటిని కలిపాను. [34]ఇక్కడను, మత్తయి 12:48–50లోను ఉన్న మాటలు మరియ యొక్క తప్పుడు పూజకు బలీయమైన వ్యతిరేకతలై ఉన్నాయి. [35]ఆయన మరణించక ముందు ఆయన చివరి అక్కర తన తల్లిని గూర్చినది (యోహాను 19:26, 27). [36]"మరియు ఆయన సోదరీమణులు" అనేది ప్రాచీన ప్రతులలో లేదు. మత్తయి 13:55, 56 ప్రకారం ప్రభువైన యేసుకు నలుగురు తమ్ముళ్లు యిద్దరు చెల్లెండ్లు ఉన్నట్టున్నారు. [37]మార్కు 2:2, 4తో దీన్ని పోల్చి చూడు. [38]దీని వెంట వచ్చే ప్రసంగంలో చూడు. [39]"మన రెండు కుటుంబాలు" అనే పాఠంలోని ఆరంభ చర్చను చూడు. [40]ఈ పాఠం యొక్క పరిచయాన్ని రివ్యూ చేయుము.

[41]మత్తయి 12:13–37లోని కొన్నిటిని రివ్యూ చేయుము.